సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



శ్రీశైలం మల్లన్నకు కొప్పుల పూజలు

ధర్మారం: మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు శ్రీశైలం మల్లికార్జునస్వామి వారిని శనివారం దర్శించుకున్నారు. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.



హరిత పెద్దపల్లిగా తీర్చిదిద్దుకుందాం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో విరివిగా మొక్కలు నాటి హరిత పెద్దపల్లిగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటినుంచి ఆదివరాహ స్వామి జయంతి ఉత్సవాలు



శ్రీఆదివరాహస్వామి సన్నిధి

కమాన్‌పూర్(మంథని): మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి జయంతి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, ఈవో కాంతరెడ్డి, ప్రధాన అర్చకులు వరప్రసాద్ తెలిపారు. ఉత్సవాలను మూడురోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

33 అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో 33 ఎజెండా అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ నజీమిన్ సుల్తానా, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

సీఎస్సార్ అమలులో ఎన్టీపీసీకి గోల్డ్ మెడల్



అవార్డు అందుకుంటున్న సీఎస్సార్ అధికారి

జ్యోతినగర్: సీఎస్సార్ అమలులో ఎన్టీపీసీ రామగుండం ఉత్తమ ప్రాజెక్టుగా నిలిచి గోల్డ్ మెడల్ అందుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన 14వ ఎక్సీడ్ గ్రీన్ ఫ్యూచర్ ఎన్విరాన్‌మెంట్, సీఎస్సార్ అండ్ హెచ్‌ఆర్ అవార్డు ప్రదానోత్సవంలో ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా చేతులమీదుగా ప్రాజెక్టు సీఎస్సార్ ప్రతినిధి నిశాంత కృష్ణ తివారీ అవార్డు అందుకున్నారు.

జిల్లాలో 30 ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో 30 ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించామని టీఎస్‌రెడ్‌కో జిల్లా మేనేజర్ పరమాచారి తెలిపారు. పీపీపీ పద్ధతిలో చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి, అర్హతగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ స్టేషన్లు ఏర్పాటవుతాయని, ఎంపిక చేసిన చార్జ్ పాయింట్ ఆపరేటర్లకు పదేళ్లవరకు స్థలాన్ని కేటాయిస్తారని వివరించారు. స్టేషన్‌ను సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని, ఆసక్తిగలవారు ఎస్‌ఆర్‌ఈడీసిఓ ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలని, దరఖాస్తుదారులు సెప్టెంబర్ 4న రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నిర్వహించే కేటాయింపు ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

క్రమబద్ధీకరణ రుసుం వసూళ్లపై దృష్టిసారించండి



నాయబ్‌తహసీల్దార్లకు సూచనలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జీఓ 58, 59 కింద క్రమబద్ధీకరణకు అందిన దరఖాస్తుదారులు రుసుం చెల్లించేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నాయబ్‌తహసీల్దార్లతో సమావేశమయ్యారు. జిల్లాలో జీఓ 59 కింద 840 దరఖాస్తులు అందాయని, 817 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందన్నారు. ఒకేసారి రుసుము చెల్లిస్తే 5శాతం రిబేట్ వర్తిస్తుందనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. జీఓ 58 కింద 1414 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

దేవుడి భూములకే శఠగోపం



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సైట్‌లో..

- పరాధీనంలో రంగనాయకులస్వామి భూములు
- పట్టా చేయించుకున్న ఓ బడానేత
- వ్యవసాయ భూములుగా చూపుతూ రైతుబంధు స్వీకరణ
- పొజిషన్‌లో కొనసాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థ
- భూముల పంచాయితీ హైకోర్టుకు చేరడంతో జిల్లాలో చర్చ



ధరణి సైట్‌లో..



ధర్మాబాద్‌లోని గోదారంగనాయకస్వామి ఆలయం

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ధూప..దీప.. నైవేద్యం.. ఆలయాల పరిరక్షణకు దాతలు వితరణ చేసిన భూములను పర్యవేక్షించడంలో దేవాదాయశాఖ నిర్లక్ష్యంతో ఆలయ భూములు పరాధీనమవుతున్నాయి. 'రాజుల సొమ్ము రాళ్లపాలు.. దేవుడి సొమ్ము దేశదిమ్మరుల పాలు' అన్న చందంగా మారింది. దేవుడి సొమ్మే కదా అని తేరగా కబ్జాలకు పాల్పడుతుండడంతో వేలాది ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నాయి. అధికారుల అలసత్వంతో ఇప్పటికే కొన్నిచోట్ల లీజుదారుల కబంధహస్తాల్లో భూమి చిక్కుకుపోయింది. భూములపై నిర్దిష్ట సమాచారం లేకపోవడం, సర్వే చేపట్టకపోవడంతో భూబకాసురుల చెర నుంచి విముక్తి చేయలేక కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పెద్దపల్లి జిల్లాలో 85 ఆలయాల పరిధిలో 1,089.34 ఎకరాలు ఉండగా.. అందులో 15 నుంచి 20 శాతం భూములు అక్రమణలో ఉన్నట్లు సమాచారం. దేవాదాయ భూములకు సంబంధించి ఎక్కడికక్కడ హెచ్చరికబోర్డులు లేకపోవడం, వందల ఏళ్ల కిందటి భూములు కావడంతో రక్షణ కరువైంది. కాలక్రమేణా వీటి ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా పెద్దపల్లి నుంచి ఓ ప్రజాప్రతినిధే అక్రమంగా దేవాదాయ భూములు పట్టా చేయించుకున్నారని హైకోర్టు నోటీసులు జారీ చేయడంతో జిల్లాలో దేవాదాయ భూముల పరిరక్షణపై చర్చ నడుస్తోంది.

నేత, బంధువుల పేరిట పట్టాలు

దేవుడి భూములు కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే వాటికి ఎసరు పెడుతున్నారు. పెద్దపల్లి మండలంలోని పాలితం, భోంపల్లి, కనగర్తి, కాసులపల్లి, ధర్మాబాద్ గ్రామాల్లో 462.33 ఎకరాల రంగనాయకులు స్వామి భూములు ఉన్నాయి. ఈ భూములను లీజుకు తీసుకొని ఏళ్లగా పేదరైతులు సాగు చేసుకుంటూ.. ప్రభుత్వానికి కాస్తు(లీజు) డబ్బులు చెల్లించేవారు. తాజాగా ధరణి పోర్టల్ వచ్చాక రెవెన్యూ రికార్డుల్లో ఆలయం పేరుకు బదులు కొందరు రైతులు పేర్లు ఎక్కించుకున్నారు. అందులో ప్రజా ప్రతినిధి, వారి కుటుంబసభ్యులు సైతం ఉన్నారు. ధరణి పోర్టల్‌లో పలువురి రైతులతోపాటు ఆ నాయకుడి కుటుంబ సభ్యుల పేరిట పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. అయినా వాటిని ఇంకా దేవాదాయశాఖ భూములుగానే చూపెడుతుండడం గమనార్హం. పాసుపుస్తకాలు జారీకావడంతో సదరు అక్రమణదారులు రైతుబంధు పొందుతున్నారు. ఆ ఆలయ భూములను పరిరక్షించాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ గోరక్షక్ జాపతి రాజేశ్‌పటేల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు సదరు నాయకుడితో సహా పలువురు రైతులు, ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీచేసింది.

ఎన్నికల అఫిడవిట్‌లో

వ్యవసాయ భూములుగా..

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సదరు నాయకుడు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తన పేరిట ఉన్న భూముల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించారు. అందులో కాసులపల్లిలో తనకు వ్యవసాయ భూమి ఉన్నట్లు చూపించారు. సదరు భూమి ధరణి పోర్టల్‌లో చూస్తే ఆ నేత పేరు చూపుతూనే.. అవి దేవాదాయశాఖ భూములుగా చూపుతుండడం గమనార్హం. ఇంకా ఆ సర్వే నంబర్లలోని భూములకు నాయకుడు రైతుబంధు తీసుకుంటుండగా, ప్రస్తుతం పొజిషన్‌లో ఆ సర్వేనంబర్లలో నాయకుడికి సంబంధించిన ప్రైవేట్ పాఠశాల కొన్నేళ్లుగా కొనసాగుతోంది. దీంతో ఎన్నికల సంఘాన్ని తప్పుదోవ పట్టించడంతోపాటు అర్హత లేకున్నా రైతుబంధు పొందుతుండడంపై వివిధ రాజకీయ పక్షాల నేతలు మండిపడుతున్నారు. స్థానిక అధికారులపై రాజకీయ ఒత్తిళ్లతోనే చర్యలు చేపట్టడం లేదని కోర్టుల ద్వారా సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని చెబుతున్నారు.

పేర్లు ఎక్కిస్తామని డబ్బులు వసూలు..

రంగనాయకుల స్వామి పరిధిలోని భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న వారిలో చిన్న, సన్నకారు రైతులు, భూస్వాములు, రాజకీయనేతలు ఉన్నారు. ధరణి పోర్టల్ వచ్చాక పలువురు నేతలు భూములను రైతుల పేరిట ఎక్కిస్తామని ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఆ సొమ్ముతో కొందరు మాత్రమే తమ పేరిట భూములను ధరణిలో ఎక్కించుకోగా.. మిగతా సాధారణ చిన్న, సన్నకారు రైతులు మోసపోయారు. స్థానిక బడా నేత, ఆయన కుటుంబ సభ్యులు, మరికొందరు విజయవంతంగా ధరణిలో పేరు ఎక్కించుకోవడంతో వారికి రైతుబంధు అందుతుండడం విశేషం. ధరణిలో ఎండోమెంట్ భూములు అని చూపుతున్నా ప్రభుత్వం రైతుబంధు చెల్లిస్తుండడం గమనించాల్సిన విషయం.

ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

దేవాదాయ భూములను ఇతరులకు విక్రయించడం, వాటిని కొనుగోలు చేయటం చట్టరీత్యా నేరం. రాజకీయ పలుకుబడి కలిగిన నేత, అతని బంధువులు మాత్రమే పట్టా చేయించుకున్నారు. నిజంగా సాగు చేసుకునే పేద, సన్నకారు రైతుల పేర్ల మీద పట్టాలు జారీకాలేదు. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. సాగుచేసుకోకుండా అందులో వ్యాపారాలు చేసుకునే వారి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. దీనిపై పలుసార్లు అధికారులను కలిసినా రాజకీయ ఒత్తిళ్లతో ఎవరూ పట్టించుకోవడం లేదు.
– సత్యనారాయణరెడ్డి, న్యాయవాది

రెండేళ్ల కిందే ప్రభుత్వానికి నివేదించాం

పాలితం గ్రామంలోని రంగనాయకుల స్వామికి చెందిన దాదాపు 400 ఎకరాలకుపైగా భూములు అన్యాక్రాంతమయ్యాయని గతంలోనే నివేదిక ఇచ్చాం. చాలా ఏళ్ల కింద స్థానికులు దేవుని మాన్యం భూములను సాగు పేరిట లీజుకు తీసుకున్నారు. వారిలో కొందరు అక్రమార్గంలో పట్టాలు పొందారు. అక్రమంగా రైతుబంధు కూడా పొందుతున్నారు. ఈ విషయాన్ని 2021లోనే పెద్దపల్లి కలెక్టర్, ప్రభుత్వానికి నివేదిక పంపాం. మా దేవాదాయశాఖ కమిషనర్ కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. వారికి వెంటనే రైతుబంధు నిలిపివేయాలని నివేదికలో పొందుపరిచాం.
– ఏసీ, చంద్రశేఖర్

జిల్లాలో 2.5 లక్షల మొక్కలు లక్ష్యం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మంథని: స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా జిల్లాలో 2.5 లక్షల మొక్కలు నాటుతామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ప్రభుత్వం శనివారం చేపట్టిన కోటి వృక్షార్చనలో భాగంగా మండలంలోని సిరిపురంలోని సంపదవనంలో కలెక్టర్ మొక్కలు నాటారు. పార్వతి బ్యారేజీ సమీపంలోని సంపద వనంలో 3వేలకు పైగా మొక్కలు నాటుతామని, అధికారులు, స్థానికులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. చెట్ల ద్వారా ప్రాణవాయువు లభిస్తుందన్నారు. సర్పంచ్ ప్రసాద్, మంథని ఆర్డీవో హనుమానాయక్, డీఆర్‌డీవో శ్రీధర్, డీఎఫ్‌ఓ శివయ్య, ఎంపీపీ కొండా శంకర్, జెడ్పీటీసీ సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ రాజయ్య పాల్గొన్నారు.

18ఏళ్లు ఉంటే ఓటరుగా నమోదుకండి

పెద్దపల్లిరూరల్: 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని శనివారం పర్యవేక్షించారు. 2023 అక్టోబర్ ఒకటి నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారంతా ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం జిల్లాలోని ఉన్నత విద్యను చదివే విద్యార్థులంతా తమ పేర్లు నమోదు చేసుకునేలా ప్రిన్సిపాళ్లు చొరవ చూపాలన్నారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం శిబిరాన్ని ఏర్పాటు చేసి నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు.

వసతులెలా ఉన్నాయ్..?

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బోధన ఎలాసాగుతోంది..? వసతులెలా ఉన్నాయ్..? అంటూ కలెక్టర్ కాలేజీలో విద్యా వసతులు, తదితర అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. పెద్దపల్లి ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ రాజ్ కుమార్, ఆర్ఐ నవీన్ రావు, ప్రిన్సిపాల్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సిమ్స్‌లో 125 మంది విద్యార్థుల ప్రవేశం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో శనివారం వరకు 125 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో చేరారు. వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ పర్యవేక్షణలో అధికారులు సర్టిఫికెట్ల పరిశీలించారు. మొదటివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ యూనివర్సిటీ స్థాయిలో ముగియగా.. ఆలిండియా స్థాయిలో ఈనెల 28 వరకు గడువు ఉంది. ఆలిండియా కోటాలో 22 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా.. 18 మంది సిమ్స్‌లో చేరారు. స్టేట్ కోటాలో 128 సీట్లు ఉండగా.. 107 మంది వచ్చారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కోటా కింద ఏడు సీట్లు కేటాయించగా.. ముగ్గురు చేరినట్లు కళాశాల అధికారులు తెలిపారు. అడ్మిషన్ల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్టూడెంట్లు, తల్లిదండ్రులతో మెడికల్ కాలేజీ ఆవరణ కిటకిటలాడింది.



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు

రాష్ట్రంలో అధికారంలోకొస్తాం

- బీజేపీ నాయకుడు మురళీధర్‌రావు

సుల్తానాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ మాజీ కార్యదర్శి పి.మురళీధర్‌రావు అన్నారు. సుల్తానాబాద్‌కు వచ్చిన ఆయనకు నాయకులు స్వాగతం పలికారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. రైల్వే బోర్డు సభ్యుడు క్యాతం వెంకటరమణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ పటేల్, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు దరాడి శ్యామ్ ఉన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

గోదావరిఖని: రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, జిల్లా ఇన్‌చార్జి రాంనాథ్ విమర్శించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదన్నారు. వచ్చేనెల 7న మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్‌ను ముట్టడిస్తామన్నారు. మల్లికార్జున్, మల్లేశ్, రేణుక, మామిడి రాజేష్, సమ్మయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మురళీధర్‌రావును సన్మానిస్తున్న వెంకటరమణ

అను బంధాల తీజ్

ఉమ్మడి జిల్లాలోని గిరిజన తండాల్లో తీజ్ సందడి నెలకొంది. తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయంగా ఈ తీజ్ పండుగను లంబాడీలు నిర్వహించుకుంటారు. ఈ పండుగ బతుకమ్మను పోలి ఉంటుంది. తీజ్‌ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. ఏటా శ్రావణంలో జరిగే ఈ సంబరాలు అంబరాన్నంటుతాయి. మంచి వరుడు దొరకాలని పెళ్లీడుకొచ్చిన యువతులు తొమ్మిది రోజులపాటు నవధాన్యాల మొలకలకు పూజలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత.
– కరీంనగర్ డెస్క్

సండే స్పెషల్

- తండాల్లో తీజ్ పండగా
- ముస్తాబైన గిరిజన గూడేలు
- శ్రావణమాసంలోనే వేడుకలు
- తొమ్మిది రోజులు సందడి
- నిష్టతో పెళ్లికాని యువతుల పూజలు



తొమ్మిది రోజులు.. కఠిన నియమాలు

పెళ్లికాని యువతులు వెదురుబుట్టలో పుట్టమట్టిని తెచ్చి అందులో నవధాన్యాలు విత్తుతారు. తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు ఉంటూ నిత్యం ఉదయం, సాయంత్రం వెదురుబుట్టలో విత్తిన గోధమనారుకు నీళ్లు పోస్తూ పూజలు చేస్తారు. ఏడో రోజు ఢమోళి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతీ ఇంట్లో బియ్యం పిండితో చుర్మో రొట్టెలు చేసి వాటిని బెల్లంతో కలిపి ముద్దలు చేస్తారు. మరోవైపు తీజ్ ఉన్న ఇంటి ఆవరణలో సేవాబాయి, మెరామల పూజలు నిర్వహిస్తారు. మెరామల పూజ ఇంటి ముందు జొన్నలు నింపిన గోనె సంచులు ఉంచి దానిపై ఒక చిన్న బిందెలో నీళ్లు పోసి అందులో వేప మండలు వేస్తారు. తొమ్మిది రోజులు అమ్మాయిలు కఠిన నియమాలు పాటిస్తారు. ఉప్పు, కారం లేని భోజనం తినాలి. తండా నుంచి బయటకు వెళ్లకూడదు. నేలపై పెట్టకుండా బావి నుంచి నీటిని బిందెలో తెచ్చి పందిరిపై నీరు పోయాల్సిందే.

బతుకమ్మను పోలిన పండుగ

తీజ్ తొమ్మిది రోజుల పండుగ. ఆటపాటలు, యువతుల నృత్యాలతో గిరిజన గూడేలలో పండుగ వాతావరణం నెలకొంటుంది. 'బతుకమ్మ'ను పోలి ఉంటుంది. గోధుమ నారును ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలే నిర్వహిస్తారు. గోధుమనారును 'తీజ్'గా పిలుస్తారు.

ఏర్పాట్ల బాధ్యత యువతులదే..

వరి నాట్లు వేయడం పూర్తి కాగానే యువతులు తండా పెద్ద అనుమతి తీసుకొని ఏర్పాట్లు చేస్తుంటారు. ఇంటింటికెళ్లి విరాళాలు సేకరించి, అంగడికెళ్లి గోధుమలు, శనగలు, ఇతర సామగ్రి తెస్తారు. గోధుమలను నానబెట్టడానికి దుస్సేరు తీగలతో బుట్టలను అల్లి, పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువు కలుపుతారు. మెదట తండా నాయకుడి చేత ఎరువు కలిపి మట్టిని పోయించి గోధుమలను చల్లిస్తారు. శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్, సీతా మేరమా మాతతోపాటు తిరుపతి బాలాజీ, హాథీరాం బాలాజీ, వేములవాడ రాజన్న, తుల్జా భవానీలను కొలుస్తారు.

ఉమ్మడి జిల్లాలో

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గిరిజన జనాభా అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, ముస్తాబాద్, మండలాల్లో తీజ్‌ను ఘనంగా నిర్వహిస్తుంటారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం, కరీంనగర్ సిటీ, చింతకుంటశాంతినగర్, జగిత్యాల జిల్లా రాయికల్, సారంగాపూర్‌లో తీజ్ వేడుకలు నిర్వహిస్తారు.



అసలేరు కార్తీలో..

శ్రావణమాసం అసలేరు కార్తీ ప్రారంభంకాగానే తండాల్లో తీజ్ వేడుకలు మొదలవుతాయి. తండాలోని పెద్ద మనిషి ఇంటి ఎదుట పందిరిని ఏర్పాటు చేసి, దానిపై గోధుమబుట్టలను పెడతారు. ఈ గోధుమ బుట్టలపై యువతులు నిత్యం ఉపవాసంతో నీరు పోస్తుంటారు. పండుగ ముగిసే వరకు యువతులు ఒక్కపూట భోజనం చేస్తారు.

గోధుమ నారుతో ఊరేగింపు

తీజ్‌లో ప్రధాన ఘట్టం చివరి రోజు గోధుమనారు బుట్టలతో ఊరేగింపు నిర్వహిస్తారు. పందిరిపై ఉంచిన గోధుమనారు బుట్టలను కిందికి దింపి మధ్యలో వాటి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేస్తుంటారు. ఇది బతుకమ్మను గుర్తుకు తెస్తుంటుంది. అనంతరం యువతులు గోధుమనారు బుట్టలను నెత్తిపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని వాగులలో నిమజ్జనం చేస్తారు. శ్రావణమాసం ప్రారంభంలో మొదలు పెట్టిన తీజ్ ఉత్సవాలు చివరి వారంలో ముగుస్తాయి.

సంస్కృతిని కాపాడుకుందాం



మాకు ప్రత్యేకమైన భాష, ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా మా సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటున్నాం. భవిష్యత్‌లో కూడా వాటిని కాపాడుకుంటాం. తీజ్ పండుగనున ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి. రాబోయే కాలంలో తీజ్ పండుగను ప్రభుత్వం గుర్తిస్తుందని భావిస్తున్నాం. – అజ్మీర శృతి, జగదాంబ తండా, గంభీరావుపేట

తొమ్మిది రోజులు ఆటపాటలతో..



తీజ్ పండుగను తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాలతో, ఆటపాటలతో నిర్వహించుకుంటాం. తీజ్ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో నవధాన్యాలు, గోధుమ మొలకలను పూజించడం ఆనవాయితీ. తీజ్ దేవత పంటలను, ప్రకతిని కాపాడుతుందని మా ప్రగాఢ విశ్వాసం. – అజ్మీర సాహితి, జగదాంబతండా, గంభీరావుపేట

తీజ్ అంటే ఆనందం



తీజ్ అంటే ఒక ప్రత్యేకమైన పండుగ. దీన్ని మేము ఆనందోత్సాహాలతో జరుపుకుంటాం. తీజ్ బుట్టలను తొమ్మిదవ రోజున మేము నిమజ్జనా నికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకెళ్తాం. గోర్ ప్రజల బతుకమ్మ తీజ్ కాబట్టి మహిళా ట్రైబ ల్ గురుకులాల్లో ప్రత్యేకమైన సెలవులు ఇ వ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. – మూడ్ మౌనిక, జగదాంబ తండా, గంభీరావుపేట

క్లుప్తంగా

కవితను కలిసిన ఎమ్మెల్యే


కవితతో ఎమ్మెల్యే చందర్, ఇతర నాయకులు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్, ఇతర నాయకులు శనివారం ఎమ్మెల్సీ కవితను శనివారం హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గంలోని పరిస్థితిని ఆమెకు వివరించారు. కవితను కలిసిన వారిలో మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మినారాయణ, బయ్యపు మనోహర్‌రెడ్డి, పాతిపల్లి ఎల్లయ్య ఉన్నారు. అనంతరం పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఒక్కరే కవితను కలిశారు.

కార్మికులే నా తోబుట్టువులు


కార్మికులకు రాఖీ కడుతున్న సంధ్యారాణి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి శనివారం రాఖీ కట్టారు. జీడీకే–11గనిలో కార్మికులను కలిసి రక్షాబంధన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తోబుట్టువులు లేని తనకు సింగరేణి కార్మికులే తోబుట్టువులని పేర్కొన్నారు. ఆమె వెంట కృష్ణవేణి, సంపూర్ణ, పుష్పలత, మౌనిక, రజిత, తదితరులున్నారు.

విద్యార్థులు చట్టాలు తెలుసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామగుండం: విద్యార్థి దశ నుంచే చట్టాలు తెలుసుకోవాలని షీ టీం ప్రతినిధులు మల్లారెడ్డి, సురేశ్, స్నేహలత, సైబర్‌క్రైం ప్రతినిధులు కోటి అన్నారు. స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళాచట్టాలు, షీ టీమ్స్ విధానాలు, ఈవ్‌టీజింగ్, పోక్సో ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ రూల్స్‌పై వివరించారు. అనంతరం విద్యార్థినులు పోలీసులకు రాఖీలు కట్టారు. సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకట్, ఏఎస్సై సుదర్శన్, రాజేశ్వర్ ఉన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న విధానాలను నిరసిస్తూ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 29న చలో హైదరాబాద్ మహాసభకు పిలుపునివ్వడం జరిగిందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇ.నరేశ్ పేర్కొన్నారు. శనివారం కుందనపల్లి కేజీబీవీ ప్రాంగణంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాలు శోభ, సరోజ, లక్ష్మి, మధునమ్మ, స్వప్న, శ్రీజ, అరుణ, లలిత తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులకు బీమా

- రైతుబీమా వలె అమలుకు ప్రభుత్వం నిర్ణయం
- పంచాయతీల నిధుల నుంచే బీమా ప్రీమియం
- జిల్లాలో దాదాపు 1,133 మంది మల్టీపర్పస్ కార్మికులు


కాట్నపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పంచాయతీల్లో జనాభాను బట్టి మల్టీపర్పస్ (పారిశుధ్య కార్మికులు) కార్మికులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించగా, మార్గదర్శకాలకు అనుగుణంగా పాలకవర్గాలు కార్మికుల నియామక ప్రక్రియ చేపట్టాయి. పాలకవర్గాలు, కార్మికులను నియమించి వారికి నెలకు రూ.8,500 వరకు వేతనాలు ఇస్తున్నారు. కాగా వారికి కేవలం వేతనం తప్ప సామాజిక భద్రత లేక పోవడంతో వారిలో ఆందోళన ఉండేది. వివిధ కారణాలతో మృతిచెందితే కనీసం బీమా సౌకర్యం కూడా లేని పరిస్థితి. గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయడం, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతరత్రా పనులతో అనారోగ్యం బారినపడిన సందర్భాలున్నాయి. దీంతో ప్రతీ కార్మికుడికి ఉచితంగా ప్రభుత్వమే బీమా చేయాలని నిర్ణయించి ఆ దిశగా ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 1,133 మందికి ప్రయోజనం చేకూరనుంది.

ఇటీవల ఆందోళన బాట

గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు ఇటీవల నిరసనలు చేపట్టారు. వేతనాలతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, పర్మినెంట్ చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక చొరవతో సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు

జిల్లాలోని 14 మండలాల్లో 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం జీపీలకు ట్రాక్టర్లు అందించడంతో డ్రైవర్‌తోపాటు ఒక్కో గ్రామ పంచాయతీకి కారోబార్, నలుగురు నుంచి పదిమంది వరకు పనిచేస్తున్నారు. రైతు మరణిస్తే రైతుబీమా పథకం కింద రూ.5 లక్షల బీమా సొమ్ము అందుతోంది. పంచాయతీ కార్మికులకు సైతం ఇదే విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం కింద నమోదైన కార్మికుడు మరణిస్తే వారి నామినీకి, కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము అందనుంది. బీమా ప్రీమియం సొమ్ము పంచాయతీ నిధుల నుంచే చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. పారిశుధ్య కార్మికుడు మృతిచెందితే గతంలో అంత్యక్రియలకు రూ.5వేలు ప్రభుత్వం అందించేది. దానిని రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇవి కూడా గ్రామ పంచాయతీ నిధుల నుంచే అందించాలి.

రెగ్యులర్ చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలి. గ్రామాల్లో వీఆర్ఏలు లేకపోవడంతో అన్ని బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తోంది. ప్రభుత్వం పర్మినెంట్ చేయకుండా బీమా సౌకర్యం కల్పించడం సరికాదు.
– ఆడెపు వెంకన్న, మల్టీపర్పస్ వర్కర్, కాట్నపల్లి

ప్రభుత్వ ఉద్యోగుల వలె..



తమను రెగ్యులర్ చేసి ప్రభుత్వ ఉద్యోగుల వలె జీతాలు చెల్లించాలి. వీఆర్ఏలు లేకపోవడంతో ముందు రెవెన్యూ పనులు తామే చేయాల్సి వస్తోంది. పంచాయతీ పనులతో పాటు ఇతరత్రా పనులు చేయాల్సి వస్తోంది.
– వెంకన్న, మల్టీపర్పస్ వర్కర్, గర్రెపల్లి

మానవ మనుగడకు చెట్లే మూలాధారం


మొక్క నాటుతున్న జెడ్పీ చైర్మన్ మధు దంపతులు, తదితరులు

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మానవ మనుగడకు చెట్లే మూలాధారమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మంథని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. మనం నాటిన ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూర్చుతాయని గుర్తించాలన్నారు. భావి భారత పౌరుల భవిష్యత్ బాగుండాలనే ఆలోచనతోనే సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మంథని ఆర్డీఓ హనుమానాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మొక్కలు నాటి సంరక్షించినప్పుడే నిర్దేశిత లక్ష్యం నెరవేరుతుందని జెడ్పీ సీఈఓ శ్రీనివాస్ అన్నారు. సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లిలో శనివారం మొక్కలు నాటారు. సర్పంచ్ దేవమ్మ, ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీఓ శశికళ, ఎంపీటీసీ విజయ, ఎంపీఓ ఫయాజ్‌అలీ తదితరులున్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

- డీపీవో చంద్రమౌళి


మొక్క నాటుతున్న డీపీవో చంద్రమౌళి

రామగుండం: మొక్కలతో పర్యావరణ పరిరక్షణ, భావితరాల మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. శనివారం తెలంగాణ దశాబ్ది వజ్రోత్సవాల ముగింపులో భాగంగా కోటి వృక్షోత్సవ వేడుకలకు హాజరై మొక్కలు నాటారు. ఇందులో భాగంగా అంతర్గాం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వెయ్యి చొప్పున మొక్కలు నాటారు. గోలివాడ పంపుహౌజ్ సర్వే నంబర్ 365లో, ఎల్లంపల్లి కేజీబీవీ పాఠశాల పరిధిలో కమ్యూనిటీ ప్లాంటేషన్ చేశారు. జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ యాదగిరి, ఏపీఓ రమేశ్, గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం జీవితంలో భాగంకావాలి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): స్వాతంత్ర వజ్రోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ అగ్నిగుండంగా పేరొందిన రామగుండంలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మొక్కలు నాటేందుకు స్థలం లేదని అనుకోవద్దని ఎక్కడ వీలుంటే అక్కడ నాటాలన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్‌కే ఝూ మాట్లాడుతూ, మొక్కల పెంపకం అందరి జీవితంలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ నాగేశ్వర్, 14వ డివిజన్ కార్పొరేటర్ నీలం పద్మ, కార్పొరేటర్లు జంగపల్లి కవితాసరోజిని, కన్నూరి సతీష్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, జిల్లా అటవీ శాఖాధికారి శివయ్య, ఎఫ్ఆర్ఓ నాగయ్య, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు సోమనాథ్, నాగవంశీ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థినికి ఆర్థికసాయం


హర్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్(పెద్దపల్లి): మండలంలోని నీరుకుల్లకు చెందిన కాదాసి రాజయ్య కూతురు హర్షితకు నీట్ ఫస్ట్ ఫేస్ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. ఆర్థికంగా నిరుపేద కావడం.. ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న ఆమె పరిస్థితిని సర్పంచ్ విజేందర్‌గౌడ్, నాయకులు కాదాసి సంజీవ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వివరించగా ఆయన స్పందించారు. శనివారం రూ.30 వేలు సాయం అందించి విద్యార్థిని అభినందించారు.

ఆత్మహత్యకు యత్నించిన సింగరేణి కార్మికుడు మృతి


సంజీవ్(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): స్థానిక తిలక్‌నగర్‌లో నివాసముంటూ జీడీకే–1వ గనిలో పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు తాటికొండ సంజీవ్(30) ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. ఈనెల 23న సంజీవ్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. సంజీవ్‌కు ఆరునెలల కిత్రం ములుగుకు చెందిన అమ్మాయితో వివాహం కాగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిగా ఉంటున్నారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ సుగుణాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు గాయపడ్డారు. మల్యాలపల్లెకు చెందిన పానుగంటి లక్ష్మినారాయణ, చైతన్యపురి కాలనీకి చెందిన వొడిచెల పోచం ఎన్టీపీసీ రామగుండం ప్లాంటులో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో కాల్వ నవీన్ పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు కారులో వస్తూ బైక్‌ను ఢీకొన్నాడు. గాయపడిన ఇరువురికి ఎన్టీపీసీ పోలీసులు ఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

తహసీల్దార్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


ఠాణాలో ఫిర్యాదు చేసిన జీడీనగర్ గ్రామస్తులు

పాలకుర్తి(రామగుండం): తమను పాలకుర్తి తహసీల్దార్ జ్యోతి అకారణంగా దూషించారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని జీడీనగర్ ఎంపీటీసీ బండారి శ్రీవాణి, మహిళలు శనివారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జీవో 59లో భాగంగా తాము ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకుంటే, వాటికి సంబంధించిన డబ్బులు చెల్లించాలని, లేదంటే ఇళ్లను కూల్చివేస్తామంటూ ఇళ్లకు వచ్చి బెదిరించారని, తమ ఇంటి పెద్దలపై అసభ్యకరంగా మాట్లాడారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేయాల్సిన సదరు అధికారి హోదాను మరిచి కనీస మర్యాద ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

వైఎస్ హయాంలో పట్టాలు :మక్కాన్ సింగ్

వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఉచితంగా పట్టాలు ఇచ్చారని, ఇప్పుడు పేదల నుంచి రూ.లక్షలు వసూలు చేయడం సిగ్గు చేటని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. తహసీల్దార్ జ్యోతి ప్రజలను అవహేళనగా మాట్లాడటాన్ని ఖండించారు. పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఏఐటీయూసీతోనే సింగరేణి పరిరక్షణ

- యూనియన్ మహాసభలో కూనంనేని సాంబశివరావు


మహాసభలో మాట్లాడుతున్న సాంబశివరావు

గోదావరిఖని: ఏఐటీయూసీతోనే సింగరేణి పరిరక్షణ సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో యూనియన్ 16వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్‌కు రాజకీయ లక్ష్యం ఉండాలని, తమ ప్రతినిధులను గెలిపించుకోవాలని సూచించారు. అనేక పోరాటాలు, త్యాగాలు చేసి నాయకులు హక్కులు సాధించి పెట్టారని తెలిపారు. కార్మిక సంఘం ఎన్నికల్లో పొత్తులు ఉండబోవని, ఏఐటీయూసీ ఒంటరిగానే పోటీ చేస్తుందని పేర్కొన్నారు. ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసెఫ్, ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసఫ్, బాలరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.గట్టయ్య, వి.సీతారామయ్య, నాయకులు మిరియాల రంగయ్య, కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల 11వ వేతన ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రంలో మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 29 హైదరాబాద్‌లో జరిగే ధర్నాలో బొగ్గు గని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 23 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు అప్పచెబుతూ ఉపాధిని దెబ్బతీసే కుట్రలను వ్యతిరేకించాలన్నారు. గేట్‌మీటింగ్‌లో నాయకులు ఇ.నరేశ్, కొమురయ్య, బాబు, యూసుఫ్, మొండయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ ఆరోపించారు. శనివారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. ప్రధాని మోదీ 9ఏళ్ల కాలంలో కార్మికులకు చేసిందేమి లేదని, ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా చేసి కార్మికులను కట్టుబానిసలుగా మార్చారన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో సింగరేణిలోని పర్మినెంట్, కాంట్రాక్ట్ అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నరేష్, అశోక్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు సన్మానం


సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావును శనివారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సన్మానించారు. జీఎం చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ సైదులు, చిలక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామమైన 18వ డివిజన్ అల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలో 27న నిర్వహించే ఉచిత వైద్య శిబిరం ఏర్పాట్లను ఆర్జీ–2 ఏరియా జీఎం సూర్యనారాయణ శనివారం పరిశీలించారు. ఆర్జీ–2 ఎస్ఓటూ జీఎం సలీం, డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, డీజీఎం సివిల్ ధనుంజయ్, సెక్టార్–3 డిస్పెన్సరీ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్, మహమ్మద్, ఈఈ సివిల్ ప్రతాపగిరి రాజ, శ్రీనివాస్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి


జీఎంను సన్మానిస్తున్న అధికారులు

రామగిరి(మంథని): ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్న వర్క్‌షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ జీఎం నాగేశ్వర్‌రావును శనివారం జీఎం కార్యాలయంలో అధికారులు సన్మానించారు. గత 37 ఏళ్లుగా సింగరేణి సంస్థలో ఎంతో నిబద్ధతతో పనిచేసిన నాగేశ్వర్‌రావు ఎంతో మందికి ఆదర్శమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేషాజీవితం సుఖసంతోషాలతో గడపాలని, ఆనందంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఏలీషా, ఎస్ఓటూ జీఎంలు రఘుపతి, బైద్య, ఏరియా సర్వే అధికారి జైనలుద్దీన్, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, డీవైపీఎం రవీందర్, డిప్యూటీ డీవైపీఎంలు శ్రీహరి, సీనియర్ ఎస్టేట్ అధికారి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో హెడ్ కానిస్టేబుల్ గల్లంతు?

- నీళ్లు నిలిపివేసినా దొరకని ఆచూకీ
- అయోమయంలో కుటుంబ సభ్యులు


మల్లయ్య

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్ఎండీ రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న కాకతీయ కాలువలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గల్లంతయ్యాడు. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ దుండే మల్లయ్య (50) శుక్రవారం సాయంత్రం కాకతీయ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్దకు వెళ్లాడు. తినుబండారం తిని కాలువలో చేతులు కడుక్కునేందుకు మెట్ల నుంచి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి అతడ్ని కాపాడేందుకు తాడు వేసినా సమయానికి అందుకోకపోవడంతో పాటు కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కొట్టుకుపోయాడు. మల్లయ్య కరీంనగర్ భగత్‌నగర్‌లో నివాసం ఉంటూ హెడ్‌కానిస్టేబుల్‌గా పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ వద్ద గన్‌మెన్‌గా పని చేశాడు.

ఈత వచ్చినా..

దుండే మల్లయ్యకు 50 ఏళ్ల వయసు ఉన్నా యువకుడిలా యాక్టీవ్‌గా ఉండేవాడు. మృదుస్వభావి, మంచికి మారుపేరుగా ఉండడంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టుబట్టి అతడ్ని గన్‌మెన్‌గా పెట్టుకున్నారు. అతడికి ఈత వచ్చినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. గల్లంతు అయ్యే సమయంలో మత్స్యకారులు తాళ్లు విసిరివేసే క్రమంలో మల్లయ్య కొద్దిదూరం ఈత కొట్టినట్లు సమాచారం. ఈదుకుంటూ కట్టవైపు రాకపోవడంతో అక్కడున్న వారు ఆందోళనకు గురయ్యారు. కొద్ది దూరం ఈదుకుంటూ వెళుతూ మునిగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కెనాల్‌లో నీటిని నిలిపివేసినా మల్లయ్య ఆచూకీ దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనపై మల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ



గోదావరిఖనిటౌన్(రామగుండం): ఈ నెల 23 నుంచి 27వరకు జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జరుగుతున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన విద్యార్థులు తెలంగాణ తరుపున పాల్గొని పతకాలు సాధించారు. చిల్డ్రన్ కేటగిరీ 30కేజీల విభాగంలో వొజ్జా సిద్ధార్థ్ బ్రాంజ్, 36 కేజీల విభాగంలో గడేసు విఖ్యాత్‌బాబు సిల్వర్ మెడల్ సాధించారు.